సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 1 । జనవరి । 2025



న్యూస్‌రీల్

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

• సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్



పాడేరు రూరల్: జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలో గిరిజన సహకార సంస్థకు సంబంధించిన రేషన్ డిపోల డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్‌పటేల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో రాజీనామాలు చేసిన, మృతి చెందిన వారి స్థానాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే రేషన్ డిపోలలో డీలర్ల నియామకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 30 రేషన్ డిపోల్లో డీలర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాత పరీక్ష నిర్వహించి, ఎంపిక చేస్తామని, అభ్యర్థులు సమీప తహసీల్దారు కార్యాలయం లేదా పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జనవరి 15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వలంటీర్ల అర్ధనగ్న ప్రదర్శన



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

ఎటపాక: గ్రామ వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎటపాకలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతి పత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డేగల మాధవరావు మాట్లాడుతూ...ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు రూ.10 వేల గౌరవవేతనం ఇవ్వాలని, వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సక్రమంగా మెనూ అమలు చేయాలి

• అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



డుంబ్రిగుడ బాలుర ఆశ్రమ పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డుంబ్రిగుడ: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలతో పాటు నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డెన్లు బాధ్యతగా వ్యహరించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి, పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పారు.

3 నుంచి పద్మాపురం గార్డెన్ మూసివేత



పీవో అభిషేక్

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలోని పద్మాపురం బొటానికల్ ఉద్యానవనాన్ని ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం తెలిపారు. గార్డెన్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని గమనించి పద్మాపురం గార్డెన్ సందర్శనకు ఎవరూ రావద్దని ఆయన కోరారు. గార్డెన్ ఆధునికీకరణ, విద్యుత్ దీపాలంకరణ పనులు పూర్తయిన తరువాత గార్డెన్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

అత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

• రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు



పాడేరు: జిల్లాలోని జి.మాడుగుల గాంధీనగర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఘటన జరగడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విచారణ జరిపి, సమగ్ర వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్టు ఆయన చెప్పారు.



వంజంగిలో క్యాంప్ ఫైర్ వద్ద యువతుల డ్యాన్స్

గ్రాండ్ వెల్‌కమ్

అర్ధరాత్రి అవుతోంది.... కాలం గడుస్తోంది.... గడియారంలో నిమిషాల ముల్లు టిక్.. టిక్.. టిక్.. అంటూ పరుగులు తీస్తోంది. సరిగ్గా 12 గంటలైంది. త్రీ...టూ..వన్...గో అంటూ అందరూ ఒక్కసారిగా హ్యాపీ హ్యాపీ న్యూఇయర్ అంటూ కొత్త సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పారు. మరో ఏడాది చరిత్రగా మారింది. కొంగొత్త ఆశలు, లక్ష్యాలతో కొత్త ఏడాదికి జిల్లా వాసులు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెబుతూ సెలబ్రేషన్ చేసుకున్నారు. అందరికీ అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. యువతీయువకులు కొత్త లక్ష్యాలతో న్యూఇయర్‌కు స్వాగతం పలికారు.



పండ్లు కొనుగోలు చేస్తున్న పాడేరు పట్టణవాసులు

సాక్షి,పాడేరు: న్యూఇయర్ అడుగిడిన వేళ అందరిలో జోష్ నెలకొంది. మంగళవారం సాయంత్రం నుంచే జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు కళకళలాడాయి. పండ్ల దుకాణాలతో పాటు పుష్పగుచ్ఛాలు,పూలదుకాణాలు రద్దీగా మారాయి. యాపిల్,కమల పండ్లు,పుష్పగుచ్ఛాల ధరలు గత ఏడాది కన్నా అధికంగా ఉన్నప్పటికీ భారీగా కొనుగోలు చేశారు. పాడేరు పట్టణంలోని మెయిన్‌రోడ్డు,పాతబస్టాండ్,సినిమాహాల్ సెంటర్ ప్రాంతాలు దుకాణాలు, కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. బేకరీల వద్ద భారీగా వ్యాపారం జరిగింది.

అంబరాన్నితాకిన న్యూఇయర్ వేడుకలు

ఘనంగా స్వాగతం పలికిన జిల్లా వాసులు

కేకేలు కట్‌చేసి, శుభాకాంక్షలు తెలిపిన యువత



థింసా నత్యం చేస్తున్న యువత



పాడేరులో పుష్పగుచ్ఛాలు కొనుగోలు చేస్తున్న స్థానికులు



న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ముగ్గు వేస్తున్న యువతులు



పాడేరు సెయింట్ ఆన్స్ చర్చిలో ప్రార్థనలు

అరకులో హంగామా



మ్యూజియం ఆవరణలో గిరిజన కళాకారులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న పర్యాటకులు



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న పర్యాటకులు

అరకులోయటౌన్: న్యూ ఇయర్ సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ లోని పర్యాటకులు,యువకులు హంగామా చేశారు. గిరిజన మ్యూజియం ఆవరణలో మంగళవారం రాత్రి సాంస్కృతి కార్యక్రమా లు నిర్వహించారు. ఏడు గంటల ప్రాంతంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ కేక్‌కట్ చేసి ఈ కార్యక్రమాలు ప్రారంభిస్తారని ముందుగా ప్రకటించారు. అయితే ఆయన హాజరుకాలేదు.

కొత్త ఆశలతో...

సాక్షి పాడేరు/చింతపల్లి/రంపచోడవరం: కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి విద్యార్థులు, యువకులు, జిల్లా వాసులు స్వాగతం పలికారు. ఈ ఏడాది కూడా మరిన్ని మెరుగైన సేవలను అందిస్తామని అధికారులు, ప్రజాసేవే లక్ష్యంగా... అందరికీ మంచి చేయడమే ధ్యేయంగా పనిచేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కఠోర శ్రమ, కృషితో తమ కలలను సాకారం చేసుకుంటామని, కొత్త లక్ష్యలతో ముందుకు సాగుతామని విద్యార్థులు తెలిపారు.

యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పన లక్ష్యం



2025 సంవత్సరం జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలి. కొత్త సంవత్సరంలో మరింత ఎక్కువ మంది గిరిజన యువతీయువకులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం పనిచేస్తాం. గిరిజన విద్యా,వైద్యానికి మరింత అధికంగా ప్రాధాన్యం ఇస్తున్నాం.టెన్త్‌తో పాటు ఇంటర్‌లోను ఉత్తమ ఫలితాలు సాధించాలి.గంజాయి సాగు నిర్మూలన,ప్రత్యామ్నాయ పంటల సాగుపైన దృష్టిపెడుతున్నాం.గిరిజన రైతులు ఉత్పత్తి చేస్తున్న కాఫీకి గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నాం.

– ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం



కొత్త సంవత్సరంలో గిరిజనులకు అన్ని రంగాల్లోను మేలు జరగాలని ఆకాంక్షిస్తున్నాను.అన్ని మారుమూల గ్రామాల్లో పెండింగ్ రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం.విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

గిరిజనుల సమగ్రాభివృద్ధి లక్ష్యం



కొత్త సంవత్సరంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలి. గిరిజనుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాను.కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు రప్పించడంతో పాటు ప్రస్తుతం అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలతో గిరిజనులకు మేలు జరగాలి

– డాక్టర్ గుమ్మా తనూజరాణి అరకు ఎంపీ

అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించే లక్ష్యంగా మరింతగా పనిచేస్తాను.ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న వారి పక్షాన పోరాటం చేస్తాం.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నాను

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే, పాడేరు.

నూతన వంగడాలను అందించడమే లక్ష్యం



నూతన సంవత్సరంలో గిరిజన రైతాంగానికి అధిక దిగుబడి నిచ్చే వంగడాలను పరిచయడమే లక్ష్యంగా పరిశోధనలు జరపడానికి ప్రణాళికలు రూపొందించాం.ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో వరిలో ఆరోగ్యకరమైన రకాలను గుర్తించడం, రాగులు,సామలు పంటల్లో కొత్త వంగడాలపై పరిశోధనలు జరపడంతో పాటు వేరుశనగ పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలను పరచయం చేయడం లక్ష్యంగా పరిశోధనలు జరుపుతున్నాం.

– డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఏడీఆర్, వ్యవసాయ పరిశోధనా స్థానం ,చింతపల్లి

నూరు శాతం ఫలితాలపై దృష్టి



కొత్త సంవత్సరంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేందుకు దృష్టిసారిస్తాం. ఆ దిశగా ప్రణాళికను అమలు చేస్తాం.గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తాం. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి పెడతాను.

– విజయశాంతి, డిప్యూటీ డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ, రంపచోడవరం

జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధనే ధ్యేయం



జాతీయ కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించడమే నూతన సంవత్సర లక్ష్యంగా నిర్ణయించుకున్నాను. జీకే వీధి మండలం గోవాడకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన నేను 2024 వ సంవత్సరంలో తమిళనాడులో జరిగిన సౌత్ జోన్ సీనియర్ మీట్‌లో గ్రీక్ రోమన్ కుస్తీ పోటీల్లో కాంస్య పతకం, అనంతపురంలో జరిగిన మరో సీనియర్ మీట్‌లో బంగారు పతకాన్ని సాధించాను.ఈ నూతన సంవత్సరంలో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి కళాశాలకు, మా ప్రాంతానికి మంచిపేరు తెచ్చే దిశగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను.ఆ దశగా నా కఠోర శ్రమను కొనసాగిస్తాను.

– సీహెచ్ మహేష్, బీఎస్సీ విద్యార్థి,డిగ్రీ కళాశాల చింతపల్లి.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ తనూజరాణి

పాడేరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి తెలిపారు. మంగళవారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి మినుములూరు గ్రామంలోని గడి కాలనీలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. గ్రామస్తులు వినియోగిస్తున్న మంచినీటి బావిని పరిశీలించారు. తాగునీటి సరఫరాకు, కాఫీకాలనీలో మినీ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎంపీని కోరారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కన్నపాత్రుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



లంబసింగి ప్రాంతంలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం జి. మాడుగులలో 13.3 డిగ్రీలు, జీకే వీధిలో 14.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ ముంచింగిపుట్టులో 14.6 డిగ్రీలు, అనంతగిరిలో 14.7,డుంబ్రిగుడలో 14.8,అరుకువేలిలో 15.0 ,పెదబయలులో 15.2,పాడేరులో 15.5,హుకుంపేటలో 16.0,చింతపల్లిలో 16.9, కొయ్యూరులో 17.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు ఏడీఆర్ తెలిపారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ



గడుగుపల్లిలో పింఛన్ పంపిణీచేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేట: సామాజిక పింఛన్ల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఒకరోజు ముందుగానే జిల్లాలో పింఛన్ల పంపిణీని చేపట్టారు. మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లిలో మంగళవారం కలెక్టర్ స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటివద్దే పింఛన్లు అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. వీలు కాని పక్షంలో లబ్ధిదారుల ఇంటి నుంచి 300 మీటర్ల లోపు నగదు అందజేస్తామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నానికి 78 శాతం పైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు చెప్పారు. జిల్లాలో 1,23,679 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.51,78,50,500 విడుదల చేసిందని తెలిపారు. ఒక్కపూటలో 96,861మందికి రూ.40,40,78,500 పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళి,ఎంపీడీవో రమాదేవి,స్థానిక సర్పంచ్ సత్యవతి,నాయకులు సోమేలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు

• కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని యువతీయువకుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నైపుణ్యాభివృద్ధి కమిటీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడేరు,రంపచోడవరం,చింతూరు ఐటీడీఏల పరిధిలోని అన్ని యువజన శిక్షణ కేంద్రాల ద్వారా డీడీయూ జీకేవై పథకంలో రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ జూనియర్,డిగ్రీ,పాలిటెక్నిక్ కళాశాలలను పీఎంకేవీవై పథకం కింద నాన్ రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రాలుగా నమోదు చేసి, శిక్షణ ఇవ్వాలని చెప్పారు. అన్ని ఐటీడీఏల పరిధిలో జాబ్ మేళాలు నిర్వహించాలని,స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై ఐటీడీఏ పీవోలు సమీక్షలు జరపాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి,ఎల్‌డీఎం మాతునాయుడు,స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి,జిల్లా వ్యవసాయ,ఉద్యానవన అధికారులు నందు,రమేష్‌కుమార్‌లు పాల్గొన్నారు,

నకిలీల నియంత్రణపై దృష్టి : వారపుసంతల్లో నకిలీ సరుకుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని అధికారులతో ఆహార భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసర సామగ్రిపైన దృష్టి పెట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించని టెండర్ దారులకు నోటీసులు జారీ చేసి, బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు.వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు.మాతాశిశు మరణాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో అభిషేక్‌తో పాట అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



కృష్ణాపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

చింతపల్లి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని మండలంలో కృష్ణాపురంలో పేదలకు దుస్తులు, రగ్గులను పంపిణీ చేశారు. పెదబరడ పంచాయితీ పరిధిలో గల కృష్ణాపురం గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు టి.మల్లేష్ మాట్లాడుతూ ఏడాది పొడుగునా ఏజెన్సీలో నిరుపేదలకు తమ వంతు సాయంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంస్థ సభ్యులు సింహాచలం, ఇమ్మానుయేలు, రామయ్య, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

గంగవరం: రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష భర్త మఠం విజయభాస్కర్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని గంగవరం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సంబంధం ఉన్నట్లు అసత్య ప్రచారాలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దారుణమన్నారు. గంగవరం మండలం పిడతమామిడిలో ఈనెల 26న పీసా గ్రామసభ కోరం ఉన్నా ఎన్నిక జరగకుండా టీడీపీ నాయకులు అక్కడి అధికారిపై ఒత్తిడి తెచ్చి సభ నుంచి బయటకు పంపించాలని ప్రయత్నిస్తే స్థానికులు అడ్డుకున్నారన్నారు. ఈ ఘటనను కూడా వైఎస్సార్‌సీపీ నాయకులపై నెట్టడం దారుణమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఎంతో కృషి చేశారన్నారు. ఇకపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

సంతలో ట్రాఫిక్ జామ్



స్తంభించిన వాహనాలు

అడ్డతీగల: మండల కేంద్రమైన అడ్డతీగలలోని సంత జరిగే ప్రాంతం వద్ద మంగళవారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దుకాణాలను రోడ్డుపై ఏర్పాటుచేయడంతో వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. దీంతో పాటు వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దివ్యాంగులతో సదరంగం

- నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్
- దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లపై కూటమి ప్రభుత్వం కుట్ర



మహారాణిపేట: దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కుట్రకు సిద్ధమవుతోంది. వారికి అందించే పింఛన్‌లో భారీగా కోత విధించాలని ఆలోచన చేస్తోంది. తద్వారా పింఛన్ భారాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. ఒకవైపు ఉన్న వారిని తగ్గించడంతో పాటు తనిఖీల పేరుతో కొత్త లబ్ధిదారులు పింఛన్ పొందే అవకాశం లేకుండా చేస్తోంది. ఇందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్ వేసింది. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. దీని వల్ల దివ్యాంగ పింఛన్ కోసం కొత్తగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

సదరం కీలకం

దివ్యాంగ పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ ఎంతో కీలకం కానుంది. ఇది లేకుండా పింఛన్ పొందే అవకాశం లేదు. ఆర్థోపెడిక్, అంధత్వం, వినికిడి, మానసిక రుగ్మతలు, శారీరక వైకల్యం, మానసిక, శారీరక లోపాలు, దృష్టిలోపంతో బాధపడే వారి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే దివ్యాంగులకు పింఛను, ఉద్యోగాల భర్తీ, బస్ పాస్, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. ఈ సర్టిఫికెట్ లేకపోతే దివ్యాంగులుగా గుర్తించే అవకాశం లేదు. తాజాగా పింఛన్ల భారాన్ని తగ్గించుకోడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దివ్యాంగులు మిగిలిన రాయితీలు, సౌకర్యాలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది.

వారంలో 240 నుంచి 280 మంది దరఖాస్తులు

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా, ఈఎన్‌టీ, మానసిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. వారంలో 240 నుంచి 280 మంది సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వైద్య పరీక్షలు పూర్తయిన 15 రోజుల్లో సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా జారీ అయ్యేవి.

3 నుంచి తనిఖీలు

జనవరి 3వ తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ ద్వారా పింఛన్లు పొందుతున్న వివరాలపై సర్వే చేయనున్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా మంచానికి పరిమితమైన పలువురికి, 80 శాతం నుంచి వంద శాతం వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. దివ్యాంగుల్లో కేటగిరీని బట్టి రూ.5 వేలు, రూ. 10వేలు,రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారు. అలాగే కిడ్నీ డయాలసిస్ రోగులకు కూడా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. కూటమి పింఛన్ల భారం తగ్గించేందుకు దివ్యాంగుల్లో అనర్హులున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టింది. అనర్హుల ఏరివేత పేరుతో పింఛన్ల భారం తగ్గించుకోవాలని చూస్తోంది. పింఛన్లు పొందుతున్న వారికి ప్రత్యేక వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని వివిధ శాఖల అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి గానీ, దివ్యాంగుల శాఖ నుంచి గానీ ఎలాంటి సమాచారం రావడం లేదు. సదరం నిలుపుదల చేశామని, 3వ తేదీ నుంచి సర్వే జరుగుతుందని మాత్రమే చెప్పి తప్పించుకుంటున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- మొరాయిస్తున్న 108
- మరమ్మతుకు నోచుకోని వైనం
- రోగులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



మరమ్మతుకు గురైన వాహనం

వై.రామవరం: ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించడం కోసం మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజల పాలిటి ఆపద్బాంధవుడైన 108 వాహనం పాడైతే పట్టించుకునే నాథుడు కరువయ్యారన్న విమర్శలున్నాయి . వివరాల్లోకి వెలితే స్థానిక సీహెచ్‌సీ నుంచి పురుగుల మందు సేవించి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ఒక వ్యక్తిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ రోగిని తరలించడానికి అడ్డతీగల మండలానికి చెందిన 108 వాహనం సాయంత్రం వై.రామవరం వచ్చింది. ఆ వాహనం సెల్ఫ్ మోటారు పనిచేయక కనీసం కిలోమీటరు దూరం తోసుకు వెళ్తే గాని సెల్ఫ్ పనిలేదు. ఆ వాహనానికి సైరన్‌గాని, హారన్‌గాని పనిచేయడం లేదు. ఇటువంటి వాహనంలో ఎమర్జన్సీ రోగులను తరలిస్తే ఎక్కడైన ట్రాఫిక్‌లో ఆగిపోతే రోగుల పరిస్థితి ఏమిటని విషం సేవించి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసారు. పాడైన 108 వాహనాలకు తక్షణమే మరమ్మతులు చేయించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి వద్ద సుమారు 10 మంది కలసి 108 వాహనాన్ని సుమారు అర కిలోమీటరు దూరం తోసుకొని వెళ్లాల్సి వచ్చిందని పలువురు చెప్పారు. ఈ విషయంపై 108 సిబ్బందిని వివరణ కోరగా మరమ్మతులకు షెడ్డుకు వెళ్లాల్సి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి ఎమర్జన్సీ వాహనాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి కండిషన్‌లో ఉంచాలని రోగులు కోరుతున్నారు.



మొరాయించిన 108 వాహనాన్ని తోస్తున్న సిబ్బంది

ఆదివాసీలకు నోటీసులు సరికాదు

హుకుంపేట: మండల కేంద్రంలో ఆదివాసీలు చేసిన చిన్నపాటి తాత్కాలిక నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు అందజేసిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, తాపుల కృష్ణారావు తదితరులు డీటీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆదివాసీలు నిర్మించుకున్న చిన్న దుకాణాలు, ఇతరత్రా నిర్మాణాలు కూల్చాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఆదివాసీలకు అధికారులు పంపిన నోటీసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు.

వైద్య సేవలపై ప్రణాళిక రూపొందించాలి

రంపచోడవరం: ఏజెన్సీలో 2025 సంవత్సరానికి సంబంధించి వైద్య సేవలు అందించేందుకు ప్రణాళిక రూపకల్పన చేయాలని ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. రంపచోడవరంలో మంగళవారం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన, ప్రణాళిక రూపకల్పనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పలు సూచనలు చేశారు. డీఎంవో ఎం.తులసి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

పాడేరు రూరల్: జి.మాడుగుల మండలం గాంధీనగర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారాన్ని నిరసిస్తు గిరిజన సమాఖ్య, మహిళ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పాడేరు ఐటీడీఏ కార్యలయం ఎదురుగా నిరసన తెలిపారు. అనంతరం గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులపై ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే వసతిగృహాల్లో అత్యాచారాలు, వివిధ కారణాలతో విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్పష్టం చేశారు. గాంధీనగర్ పాఠశాల ఘటనలో హెచ్‌ఎం, వార్డెన్‌తో పాటు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు లతకుమారి, రాణి, విమల,స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ వద్ద నిరసన చేస్తున్న ప్రజా, మహిళ సంఘాల నాయకులు

రూ.1.90 కోట్లతో పాడేరులో రోడ్డు అభివృద్ధి



తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు

సాక్షి,పాడేరు: పట్టణంలో నక్కలపుట్టు,మెయిన్‌రోడ్డు,మెడికల్ కళాశాల ప్రాంతాలలో ఆర్అండ్‌బీ రోడ్డును రూ.1.90 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు పాడేరు ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు తెలిపారు.మంగళవారం ఆయన పాడేరు మెయిన్‌రోడ్డులో రోడ్డు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఘాట్‌రోడ్డు దిగువ నుంచి వడ్డాది రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి రైళ్ల వేళల్లో స్వల్పమార్పులు

తాటిచెట్లపాలెం: కొత్త సంవత్సరం తొలి రోజు నుంచి పలు రైళ్ల వేళలు మారాయి. ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరే, ఆయా స్టేషన్‌లకు చేరుకునే సమయాల్లో స్వల్పమార్పులు చేశారు. విశాఖకు చేరుకునే సమయం, ఇక్కడి నుంచి బయల్దేరే రైళ్ల సమయాలు.

	నడిచేరోజులు	ప్రస్తుత సమయం	మారిన సమయం
కిరండూల్-విశాఖపట్నం(18513)	ప్రతీరోజు	తెల్లవారు 2.40	తెల్లవారు 3.40
ఎల్‌టీటీ-విశాఖపట్నం(22848)	బుధ	ఉదయం 05.10	ఉదయం 5.20
సికింద్రాబాద్-విశాఖపట్నం(12784)	ఆది	ఉదయం 9.50	ఉదయం 9.45
భగత్‌కి కోటి-విశాఖపట్నం(18574)	సోమ	ఉదయం 10.00	ఉదయం 10.05
సికింద్రాబాద్-విశాఖపట్నం(20707)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.50	మధ్యాహ్నం 1.45
దుర్గ్-విశాఖపట్నం(20829)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.45	మధ్యాహ్నం 1.50
భువనేశ్వర్-విశాఖపట్నం(22819)	ప్రతీరోజు	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.30
రాజమండ్రి-విశాఖపట్నం(67295)	ప్రతీరోజు	మధ్యాహ్నం 2.50	సాయంత్రం 4.50
కోరాపుట్-విశాఖపట్నం(58537)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.15
పలాస-విశాఖపట్నం(67293)	ప్రతీరోజు	సాయంత్రం 5.50	సాయంత్రం 6.00
అమృత్‌సర్-విశాఖపట్నం(20808)	సోమ,మంగ,శుక్ర	రాత్రి 9.40	రాత్రి 9.50
సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం(18504)	శని	రాత్రి 9.40	రాత్రి 9.50
సికింద్రాబాద్-విశాఖపట్నం(20834)	మంగళ మినహా	రాత్రి 9.31	రాత్రి 9.35
విశాఖపట్నం-రాయ్‌పూర్(58528)	ప్రతీరోజు	ఉదయం 4.25	ఉదయం 4.20
విశాఖపట్నం-సికింద్రాబాద్(20708)	గురువారం మినహా	మధ్యాహ్నం 2.35	మధ్యాహ్నం 2.30
విశాఖపట్నం-కాకినాడ(17268)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.00
విశాఖపట్నం-దుర్గ్(18530)	ప్రతీరోజు	సాయంత్రం 4.55	సాయంత్రం 4.50
విశాఖపట్నం-షాలిమర్(22854)	బుధ	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-ధీఘా(22874)	గురు	మధ్యాహ్నం 3.30	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-గాంధీదాం(20803)	గురు	సాయంత్రం 5.35	సాయంత్రం 5.30
విశాఖపట్నం-కోర్బా(18518)	ప్రతీరోజు	రాత్రి 9.05	రాత్రి 9.10
విశాఖపట్నం-బనారస్(18311)	బుధ,ఆది	ఉదయం 4.20	ఉదయం 4.15
కోరాపుట్-విశాఖపట్నం(18511)	మంగళ,శని	మధ్యాహ్నం12.00	మధ్యాహ్నం 2.45

రంపచోడవరం ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలి



పీవో కట్టా సింహాచలంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

- గర్భిణి మృతిపై సమగ్ర విచారణ జరపించాలి
- పీవోను కలిసి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కోరారు. స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను మంగళవారం ఆమె కలిశారు. ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందక గర్భిణి మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని పీవోను కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును పీవోకు వివరించారు. అక్కడ పనిచేస్తున్న వైద్యులు రోగి నాడి పట్టుకుని చూసేందుకు కూడా ఇష్టపడడం లేదన్నారు. పది రోజులు ముందుగానే ఆస్పత్రిలో చేరిన గర్భిణి లక్ష్మి మృతిచెందడం బాధకరమన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా పనిచేశాం..

అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో 2014–2019 మధ్య మాతాశిశు మరణాలు సంభవించాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాతాశిశు మరణాలను పూర్తిగా తగ్గించామన్నారు. ఇప్పుడు తిరిగి మరణాలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలల ఏర్పాటు చేశారని తెలిపారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి స్థాయిని పెంచామన్నారు. మల్టీపర్పస్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించినట్టు చెప్పారు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పని చేశామన్నారు. కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటు, భవనాలు నిర్మాణం తమ హయాంలో జరిగాయన్నారు. గర్భిణి మృతిపై పీవో దర్యాప్తునకు ఆదేశించారని, వైద్యుల నిర్లక్ష్యం ఉందని విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలో మాతాశిశు సంరక్షణ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలి పారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, కోఆప్షన్ మెంబరు షేక్ వలీ, పార్టీ నాయకులు జల్లేపల్లి రామన్నదొర, పండా రామకృష్ణదొర, చితుకులయ్యరెడ్డి, కొండ్రాజు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో జిల్లా ఫస్ట్

- డ్వామా పీడీ విద్యాసాగర్



మాట్లాడుతున్న విద్యాసాగర్

కొయ్యూరు: ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మంది వేతనదారులతో 'వందరోజుల' పనులు పూర్తి చేయడంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానంలో ఉందని డ్వామా పీడీ డాక్టర్ డి.బి. విద్యాసాగర్ తెలిపారు. రెండో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా ఉన్నట్టు చెప్పారు. ఉపాధి పథకం సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 43,880 మంది వేతనదారులు వంద రోజుల ఉపాధి పనులను పూర్తి చేశారని చెప్పారు. జిల్లాలో 2.4 లక్షల మందికి ఉపాధి జాబ్ కార్డులుంటే వారిలో 2.2 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయన్నారు. ఈ ఏడాది రూ.650 కోట్ల విలువైన పనులు చేసినట్టు చెప్పారు. ఈ మొత్తంలో రూ.350కోట్లు కూలీలకు, రూ.300 కోట్లు మెటీరియల్‌కు చెల్లించామన్నారు. పనులు చేసిన వెంటనే కూలీల ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 4,400 ఫారం పాండ్‌లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.ఇప్పటి వరకు 1,840 పూర్తి చేశామని,మిగిలిన పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలో వాటిని పూర్తి చేస్తామన్నారు. పది వేల ఎకరాల్లో మొక్కలు నాటి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇంతకుముందు ఆయన గదబపాలెంలో ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడారు. దీనిలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతులతో పీడీ, ఎంపీడీవో, తదితరులు

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన



సీఈ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



సీఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

మోతుగూడెం: ఛండీగఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జెన్‌కో మోతుగూడెం చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా యూనియన్ సీఐటీయూ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న సుమారు 220 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలని, ఏపీజెన్‌కోలో ఖాళీగా ఉన్న ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రీజనల్ కార్యదర్శి రత్నాకర్, సూర్యనారాయణ, సీఐటీయూ నాయకులు బి.వి. రమణ, కాంట్రాక్టు కార్మికులు బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌సన్, కార్యదర్శి పేపకాయల శ్రీను, ట్రెజరర్ మల్లేశ్వరరావు, జోసెఫ్, సన్యాసిరావు, సూరిబాబు, దార మహేష్, రజిని,బాబూరావు, సీత తదతరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: రహదారులు బాగు చేయాలని మండలం సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్ర, ఒడిశా అంతరాష్ట్ర ప్రధాన జాతీయ రహదారి అడపవలస గ్రామ సమీపంలో ఉన్న రోడ్డు మార్గం పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ వాహనాచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన చెందారు. ఆరు నెలల క్రితం గ్రామస్తుల సహకారంతో శ్రమదానం చేసి గోతులు పూడ్చడమైందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రహదారిలో గోతులు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు లేనిపక్షంలో వాహనచోదకులు, స్థానికులతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు ప్రసాద్, దేవా, సింహాద్రి. సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపునకు గురవుతున్న గ్రామాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయార్టీ జాబితాలో చేర్చిందని, ఆయా గ్రామస్తులకు ప్రస్తుత ప్రభుత్వం వెంటనే అవార్డు సమావేశం నిర్వహించి ప్యాకేజీ ఇవ్వాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది.

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్, స్ట్రక్చర్ వ్యాల్యూ, భూనష్ట పరిహారం ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. సీతారామయ్య, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ వెంకమ్మ, నాగరాజు, షణ్ముఖరావు, శ్యామలకృష్ణ, ఉపేంద్ర, మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు బొర్రయ్య

ఏపీటీఎఫ్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: ఏపీటీఎఫ్ వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్‌మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ,జిల్లా ప్రతినిధులు శ్యాంసుందర్,సన్యాసిరావు,శాంతకుమారి,కై లాసం,సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విద్యార్థులకు అభినందనలు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల ఏలూరులో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ చాటారు. ఖోఖో మెన్స్ టోర్నమెంట్‌లో 3వ బహుమతి కై వసం చేసుకున్నారు. ఈ మేరకు కళాశాల విద్యార్థి టి.రవికుమార్ ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఖోఖో మెన్ టీమ్‌లో స్థానంలో సంపాదించినట్టు తెలిపారు. నన్నయ్య యూనివర్సిటీ మహిళా వాలీబాల్ టీమ్‌కి ఎల్.జ్యోతి మొదటి సంవత్సరం విద్యార్థి ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరందరూ ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ , అధ్యాపకులు వెంకటేష్, చక్రవర్తి, రవికుమార్, పీడీ ప్రభాకర్‌రావు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వసుధ, అధ్యాపకులు